# సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్..

- సెప్టెంబర్ పదిలోపు నమోదుకు గడువు
- మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్




**ఆమనగల్లు, ఆగస్టు22(నేటి దర్శిని):** తెలంగాణ ప్రభుత్వం సన్న వరి సాగును ప్రోత్సహిస్తూ రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించేందుకు నిర్ణయించిందని ఆమనగల్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఏడు సన్న వరి రకాలను సాగు చేసిన రైతులు బోనస్ పొందేందుకు తప్పనిసరిగా పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. 15048 (తెలంగాణ సోనా),5204 (సాంబా మసూరి),1638, సోనా, జై శ్రీరామ్, 44, 7715 రకాలను సాగు చేసిన రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. రైతులు తాము వరి విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్లను సంప్రదించి పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. యూనివర్సిటీ నుంచి లేదా ఇతర రైతుల నుంచి విత్తనాలు తీసుకుని సాగు చేసిన రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈవో ) సంప్రదించి నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.నమోదు చేసుకున్న రైతుల వివరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని,ధాన్యం కొనుగోలు సమయంలో బోనస్ మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని వ్యవసాయ అధికారి తెలిపారు.సన్న రకాలను సాగు చేసిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నమోదుకు చివరి తేదీ సెప్టెంబర్ 10 అని స్పష్టం చేశారు.గడువు తేదీలోపు నమోదు చేసుకోని రైతుల ధాన్యానికి కొనుగోలు సమయంలో రూ.500 బోనస్ వర్తించదని తెలిపారు.నమోదు కోసం ఆమనగల్లు ఏఈవో నికిత , రాంనుంతల క్లస్టర్ ఏఈవో మీనాక్షి,ఆకుతోటపల్లి క్లస్టర్ ఏఈవో భూదేవి ,పోలేపల్లి క్లస్టర్ ఏఈ వో ప్రభావతి ని సంప్రదించాలని వ్యవసాయాధికారి శ్రీనివాస్ గౌడ్ సూచించారు.

# గొర్రెల పరిశోధనా క్షేత్రంలో జిల్లా పశువైద్యాధికారి పర్యటన



**మిడ్జిల్, ఆగస్టు 22, (నేటి దర్శిని):** మిడ్జిల్ మండలం సింగందొడ్డి గ్రామంలోని మందాకిని గొర్రెల పరిశోధనా క్షేత్రాన్ని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి డాక్టర్ శివానందస్వామి శనివారం సందర్శించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ అనుప శివరాజ్‌తో కలిసి పరిశోధనా క్షేత్రంలోని గొర్రెల పెంపకం, సంరక్షణ, నిర్వహణకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గొర్రెల ఆరోగ్య పరిస్థితి, అందిస్తున్న పశువైద్య సేవలు, పరిశోధనా కార్యక్రమాల అమలు తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గొర్రెల పెంపకంలో శాస్త్రీయ విధానాలను పాటిస్తూ మెరుగైన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోటయ్య పాల్గొని మందాకిని గొర్రెల పరిశోధనా క్షేత్రానికి సంబంధించిన వివరాలను జిల్లా పశువైద్యాధికారికి వివరించారు.






# శాంతి కమిటీ సభ్యులు యువతకు మార్గదర్శకంగా నిలవాలి

- మత సామరస్యం, ఐక్యతతో రాబోయే అన్ని పండుగలను ప్రశాంతంగా నిర్వహించాలి
- సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, రెచ్చగొట్టే పోస్టులు వైరల్ చేస్తే చట్టపరమైన చర్యలు
- శాంతి కమిటీ సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్

**మిడ్జిల్, ఆగస్టు 22, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానం హాల్ నందు జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ గారి ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. రాబోయే వివిధ మతాల పండుగలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో శాంతిభద్రతలు, మత సామరస్యం, సోదరభావం, ప్రజల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయడంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ జిల్లాలో అన్ని మతాల ప్రజలు ఎప్పటి నుంచో పరస్పర గౌరవం, సోదరభావంతో పండుగలను జరుపుకుంటూ శాంతియుత వాతావరణాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. గతంలో కూడా అన్ని వర్గాల ప్రజలు పోలీసు శాఖకు అందించిన సహకారం అభినందనీయమని, అదే స్ఫూర్తితో రాబోయే అన్ని పండుగలను కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.శాంతి కమిటీ సభ్యులు, మతపెద్దలు, సమాజంలోని పెద్దలు మరియు ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా యువతను సరైన మార్గంలో నడిపించడంలో పెద్దలు మార్గదర్శకులుగా నిలవాలని, యువతలో సామాజిక బాధ్యత, మత సామరస్యం, సోదరభావం పెంపొందించేలా అవగాహన కల్పించాలని కోరారు. యువత ఎలాంటి వివాదాలకు, గొడవలకు, ఇతరులను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా వారికి దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యత పెద్దలపై ఉందన్నారు.అదేవిధంగా డీజే (డీజే ) వినియోగంపై కూడా ఎస్పీ ప్రత్యేకంగా సూచనలు చేశారు. పండుగల సమయంలో డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్‌లను నిబంధనలకు విరుద్ధంగా వినియోగించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. అధిక శబ్దం వల్ల వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, ప్రజల ఆరోగ్యం మరియు ప్రశాంతమైన వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని డీజేలు, సౌండ్ సిస్టమ్‌లను పరిమితంగా, నిబంధనలకు అనుగుణంగా వినియోగించాలని కోరారు.సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. అనవసరమైన, వివాదాస్పదమైన, రెచ్చగొట్టే పోస్టులు పెట్టడం, ఒక మతానికి లేదా వర్గానికి వ్యతిరేకంగా ఉన్న సమాచారాన్ని ప్రచారం చేయడం, ఫేక్ న్యూస్‌ను వైరల్ చేయడం, నిర్ధారణ లేని సమాచారాన్ని ఇతరులకు ఫార్వర్డ్ చేయడం వంటి చర్యలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు.సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని నిజమని నమ్మకుండా, దాని వాస్తవికతను నిర్ధారించుకున్న తర్వాతే స్పందించాలని తెలిపారు. ముఖ్యంగా పండుగల సమయంలో మత విద్వేషాలు, అపోహలు లేదా ఉద్రిక్తతలకు దారితీసే సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ షేర్ చేయవద్దని సూచించారు. తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే పోస్టులు లేదా ఉద్దేశపూర్వకంగా వివాదాలకు దారితీసే సమాచారాన్ని ప్రచారం చేసే వారిపై పోలీసు శాఖ నిరంతరం నిఘా ఉంచుతుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.ఎలాంటి వదంతులు, అనుమానాస్పద సమాచారం లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలు ప్రజల దృష్టికి వచ్చినా వాటిని నమ్మకుండా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి ఒక్కరూ సంయమనం పాటిస్తూ, పరస్పరం గౌరవించుకుంటూ పోలీసు శాఖకు సహకరించాలని తెలిపారు.ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న వివిధ మతాల మతపెద్దలు, శాంతి కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు మరియు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ, జిల్లాలో అన్ని మతాల ప్రజల మధ్య ఉన్న సోదరభావం, ఐక్యతను మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. రాబోయే పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తామని, యువతకు సానుకూల దిశానిర్దేశం చేస్తామని పేర్కొన్నారు.అదేవిధంగా పండుగల సమయంలో డీజేలు, ఊరేగింపులు, సోషల్ మీడియా వినియోగం తదితర అంశాల్లో నిబంధనలు పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు తెలిపారు. మతాల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం, శాంతి, సోదరభావం పెంపొందించడమే సమాజానికి బలమని పేర్కొన్నారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అన్ని విధాలుగా అప్రమత్తంగా ఉంటుందని, రాబోయే పండుగలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన భద్రతా చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ తెలిపారు.మత సామరస్యం, సోదరభావం, ఐక్యత, శాంతియుత వాతావరణం ప్రతి ఒక్కరి బాధ్యత. మనమంతా కలిసి పండుగలను ఆనందంగా, ప్రశాంతంగా నిర్వహించాలి" అని జిల్లా ఎస్పీ గారు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చీదీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీర్బ్ డీఎస్పీ రమణా రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్, జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్, RI కృష్ణయ్య, ఎన్జూ ప్రెసిడెంట్ యాది రెడ్డి, వీ×వీ ప్రెసిడెంట్ హాదీ, జడ్చర్ల టౌన్ హిందూ మరియు ముస్లిం మత పెద్దలు, INTUC ప్రెసిడెంట్ రాములు యాదవ్, కార్పొరేటర్లు, శాంతి కమిటీ సభ్యులు, వివిధ మతాల మతపెద్దలు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 100 మంది విద్యా వాలంటీర్లతో 'శతశాతం' కార్యక్రమం

- విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయడమే లక్ష్యం: యెన్నం శ్రీనివాస్ రెడ్డి






**మిడ్జిల్ , ఆగస్టు 22, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు విద్యా వాలంటీర్ల వ్యవస్థను మరింత విస్తరిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తొలుత 35 మంది విద్యా వాలంటీర్లతో నిర్వహించిన కార్యక్రమం విజయవంతం కావడంతో ప్రస్తుతం 100 మందితో విస్తృతంగా అమలు చేస్తున్నామని చెప్పారు.విద్యా వాలంటీర్లు విద్యార్థుల హాజరు, చదువు, హోంవర్క్, ప్రవర్తన, విద్యాపరమైన సమస్యలను నిరంతరం గమనించి ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. 3డీ యానిమేషన్లు, డిజిటల్ లెర్నింగ్, యానిమేటెడ్ పుస్తకాలు, డిజిటల్ బోర్డుల వంటి ఆధునిక పద్ధతులతో విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచుతున్నామని తెలిపారు.దేశానికి ఆదర్శంగా 'శతశాతం' కార్యక్రమాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యా వాలంటీర్లు, సబ్జెక్ట్ నిపుణుల సమిష్టి కృషితో మహబూబ్‌నగర్ విద్యా మోడల్‌ను రాష్ట్ర, దేశ స్థాయిలో ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తామని అన్నారు.జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ విద్యా వాలంటీర్ల కార్యక్రమం అద్భుతమైనదని, విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఒక గ్రామం నుంచి ప్రారంభమయ్యే విద్యా విప్లవం జిల్లా, రాష్ట్ర, దేశ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# క్రేజ్ వీల్స్‌తో ధ్వంసమవుతున్న రోడ్లు..

- చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి


నారమ్మ గూడెంలో క్రేజ్ వీల్స్ తో టాక్టర్


క్రేజ్ వీల్స్ వలన ధ్వంసం అయిన రోడ్డు

**నిడమానూరు, ఆగస్టు 22 (నేటి దర్శిని):** నిడమానూరు మండలంలోని పలు గ్రామాల్లో ట్రాక్టర్లకు అమర్చుతున్న క్రేజ్ వీల్స్ కారణంగా రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన రోడ్లు ధ్వంసం కావడంతో ప్రజాధనం వృథా అవుతోందని వారు పేర్కొంటున్నారు. మండలంలోని రేగులగడ్డ, నారమ్మగూడెం, తుమ్మడం, వడ్డెరగూడెం, ముప్పారం, ఊట్కూర్, బంకాపురం, వెనిగండ్ల, నిడమానూరు, శాఖాపురం, సోమారిగూడెం, వేంపాడు తదితర గ్రామాల్లో ట్రాక్టర్లను క్రేజ్ వీల్స్‌తో రోడ్లపై తిప్పుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. భారీ బరువులతో కూడిన ట్రాక్టర్లకు క్రేజ్ వీల్స్ అమర్చడం వల్ల రోడ్లపై గీతలు పడటంతో పాటు రహదారులు త్వరగా దెబ్బతింటున్నాయని అంటున్నారు. ట్రాక్టర్లకు క్రేజ్ వీల్స్‌కు బదులుగా రోడ్లు దెబ్బతినకుండా ఉపయోగించేందుకు రెండు ఇంచుల పట్టీలు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని అమర్చుకుని తొలగించే అవకాశం ఉన్నా కొందరు ట్రాక్టర్ యజమానులు సౌలభ్యం కోసం క్రేజ్ వీల్స్‌ను వినియోగిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు, పోలీస్ అధికారులు స్పందించి క్రేజ్ వీల్స్ వినియోగంపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, రోడ్లను పరిరక్షించేందుకు తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# జప్తు చేసిన ఇసుకను లెవెల్ చేసి మట్టితో కప్పినట్లు గుర్తింపు

- నిబంధనల ప్రకారం సంబంధిత పట్టాదారులకు షోకాజ్ నోటీసులు



**మిడ్జిల్ , ఆగస్టు 22, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో) :** మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామం, మండలంలోని సర్వే నంబర్ 96లో గతంలో జప్తు చేసిన ఇసుకను లెవెల్ చేసి మట్టితో కప్పిన ఘటనపై విచారణ నిర్వహించినట్లు గనులు మరియు భూగర్భ శాఖ సహాయ సంచాలకులు ఎం. హరికృష్ణ తెలిపారు.వివిధ వార్తా దినపత్రికల్లో ప్రచురితమైన కథనాల నేపథ్యంలో ఈ నెల 19 న రెవెన్యూ, గనులు మరియు భూగర్భ శాఖలకు చెందిన అధికారులు సర్వే నంబర్ 96లో జప్తు చేసిన ఇసుక నిల్వ ఉన్న ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ తనిఖీల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా జప్తు చేసిన ఇసుకను లెవెల్ చేసి, దానిపై మట్టిని కప్పినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ నెల 20 న నిర్వహించాల్సిన ఇసుక వేలీ ప్రక్రియకు ముందు ఈ విధంగా చేయడం జరిగినట్లు అధికారుల తనిఖీలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.ఈ అంశంపై అధికారులు పంచనామా నిర్వహించి, పూర్తి వివరాలతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించినట్లు ఎం. హరికృష్ణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ఇసుక తవ్వకాల నిబంధనలు--2015 ప్రకారం సంబంధిత పట్టాదారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు.సంబంధిత వ్యక్తుల నుంచి వివరణలు స్వీకరించిన అనంతరం, నిబంధనల ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు గనులు మరియు భూగర్భ శాఖ సహాయ సంచాలకులు ఎం. హరికృష్ణ స్పష్టం చేశారు.

## బాల్ నగర్ మండల టీయూడబ్ల్యూజే (హెచ్-143) మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక...



**మిడ్జిల్, ఆగస్టు 21, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
టీయూడబ్ల్యూజే (హెచ్-143) మహబూబ్‌నగర్ జిల్లా అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో బాల్ నగర్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వరంగల్ శివకుమార్, కో-కన్వీనర్ చింతకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండల కమిటీని ప్రకటించారు. నూతన కమిటీ పదవులు: బాల్ నగర్ మండలం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా..ఎన్నుకోవడం జరిగింది.. అధ్యక్షులుగా పురుషోత్తం రెడ్డి (ఆంధ్రజ్యోతి) ప్రధాన కార్యదర్శిగా రాజేందర్ (వెలుగు) ఉపాధ్యక్షులుగా.. 1)..జగత్ ప్రకాష్( ప్రజా దర్బార్ ).. 2)..నవీన్( మనం)...
కోశాధికారిగా శ్రీశైలం( ఆంధ్రప్రభ) ప్రచార కార్యదర్శిగా కృష్ణ (పయనించే సూర్యుడు ) లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నరేందర్ చారి, నరేందర్ గౌడ్, కృష్ణ యాదవ్ తో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు. అంతకుముందు ముందు అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో బాల్ నగర్ మండల సభ్యులకు యూనియన్ సభ్యత్వ కార్డులను అందజేశారు.
ఈ సందర్భంగా నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన బాల్ నగర్ మండల కమిటీకి అడ్‌హక్ కమిటీ నాయకులకు. అభినందనలతెలియజేస్తూ, పాత్రికేయుల హక్కుల పరిరక్షణకు, సంఘ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

## గోపి కుటుంబానికి బీఆర్ఎస్ నేత భీల్యానాయక్ ఆర్థిక సాయం



**చింతపల్లి, ఆగస్టు 22 (నేటి దర్శిని):**
అనారోగ్యంతో మృతి చెందిన వంకుడావత్ గోపి కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ పరామర్శించారు. చింతపల్లి మండలం వింజమూరు గ్రామం దేవులతండాలోని గోపి నివాసానికి శనివారం వెళ్లిన ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా గోపి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భీల్యానాయక్ తెలిపారు.కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిత దాసు నాయక్, దండేటి కార్ ప్రసాద్, ఉపసర్పంచ్ చందర్ నాయక్, కేతావత్ హరిలాల్ నాయక్, వార్డు సభ్యులు మహామహుద్, రాము నాయక్, రాము, లచ్చు నాయక్, వస్రం నాయక్, నేనావత్ నాగార్జున నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంతో వరికి బ్రేక్..

**●ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన**




**చింతపల్లి, ఆగస్టు 22 (నేటి దర్శిని):**
ఎల్ నినో వాతావరణ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదల, రానున్న రోజుల్లో విద్యుత్ కోతలను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి నాట్లు వేయకుండా ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఏ. నరసింహ సూచించారు. చింతపల్లి మండలం కుర్మేడు క్లస్టర్ పరిధిలోని మోదుగుల మల్లేపల్లి గ్రామంలో శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ముద్దం మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. అధిక నీరు, విద్యుత్ అవసరమయ్యే వరికి బదులుగా తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు.రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడిపై దృష్టి సారించాలని, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాపై అవగాహనతో సహకరించాలి





**●సర్ రెండో విడత ప్రక్రియపై బీఎల్‌ఏలకు ఎమ్మెల్యే బాలు నాయక్ దిశానిర్దేశం**

**దేవరకొండ, ఆగస్టు 22 (నేటి దర్శిని):**
ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ-2026 రెండో విడత ప్రక్రియపై ఓటర్లు అవగాహనతో సహకరించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సూచించారు. శనివారం దేవరకొండ పట్టణంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో బీఎల్‌ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో జిల్లా అధ్యక్షుడు పున్న కైలాష్ నేతతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సర్ కు ముందు దేవరకొండ నియోజకవర్గంలో 2,69,098 మంది ఓటర్లు ఉండగా, ఆగస్టు 17న విడుదలైన డ్రాఫ్ట్ జాబితాలో 2,32,283 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వివిధ కారణాలతో 36,815 మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించినట్లు చెప్పారు. వీరిలో 7,451 మంది మరణించినవారు, 7,629 మంది డూప్లికేట్ ఓటర్లు, 395 మంది చిరునామాల్లో లేనివారు, 21,313 మంది ఇతర ప్రాంతాలకు తరలివెళ్లినట్లు గుర్తించినవారు ఉన్నారని వివరించారు. 51,427 మందికి నోటీసులుప్రస్తుత ఓటరు జాబితాలో 51,427 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు బాలు నాయక్ తెలిపారు. ఇందులో 4,784 మంది నో మ్యాపింగ్, 46,643 మంది లాజికల్ ఎర్రర్స్ కింద ఉన్నారని పేర్కొన్నారు. వీరికి ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 27 వరకు ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహిస్తారని చెప్పారు. నోటీసులు అందడంలో ఇబ్బందులు ఎదురైనా.. విచారణకు సంబంధించిన సమాచారం ఉన్న ఓటర్లు నిర్ణీత తేదీన హాజరై తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల డాక్యుమెంట్లలో అందుబాటులో ఉన్న ఆధారాలను బీఎల్‌ఓలు, ఎంఆర్‌ఓలకు సమర్పించి ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి 18 సంవత్సరాలు నిండినా ఓటరు జాబితాలో పేరు లేని వారు ఫారం-6 ద్వారా సెప్టెంబర్ 16 వరకు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం అర్హులైన వారిని తుది జాబితాలో నమోదు చేస్తారని చెప్పారు. తుది ఓటరు జాబితా అక్టోబర్ 19న ప్రచురించనున్నట్లు వెల్లడించారు. 2002 ఓటరు జాబితా, ప్రస్తుతం ఉన్న 2025 ఓటరు జాబితా మధ్య తేడాలు ఉన్న సందర్భాల్లోనే సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించేందుకు అధికారులు, పార్టీ బూత్ స్థాయి ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**338కు చేరిన పోలింగ్ కేంద్రాలు**

దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో ఓటర్లకు సేవలు సులభంగా అందించేందుకు మున్సిపల్ కమిషనర్‌ను అదనపు ఏఈఆర్వోగా నియమించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.నియోజకవర్గంలో గతంతో పోలిస్తే 12 పోలింగ్ కేంద్రాలు అదనంగా ఏర్పాటు చేయడంతో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 338కు చేరిందని వెల్లడించారు. సర్ ప్రక్రియలో కాంగ్రెస్ బీఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణకు కృషి చేయాలని బాలు నాయక్ పిలుపునిచ్చారు. ప్రజలకు సరైన అవగాహన కల్పిస్తూ ఓటరు జాబితాలో తప్పులు లేకుండా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నల్గొండ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, సర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఎల్‌ఏలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జునసాగర్ నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

**●మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నూకల వెంకటరెడ్డి డిమాండ్**



**నిడమనూరు, ఆగస్టు 22 (నేటి దర్శిని):**
నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 530 అడుగులకు పైగా ఉండటంతో పాటు ఎగువన ఉన్న ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వలు పూర్తిస్థాయిలో ఉన్న నేపథ్యంలో, వెంటనే సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి రైతులను, నల్లగొండ జిల్లా ప్రజలను ఆదుకోవాలని నిడమనూరు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నూకల వెంకటరెడ్డి కోరారు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే బోర్ల ఆధారంగా పంటలు సాగు చేస్తున్న రైతులకు సాగునీరు అందించడంతో పాటు గ్రామాల్లో తాగునీటి అవసరాలను తీర్చేందుకు చెరువులు, కుంటలను నీటితో నింపాలని కోరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సాగర్ ఎడమ కాలువకు నీటి విడుదల జరిగేలా చర్యలు చేపట్టాలని వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే పార్లమెంట్ సభ్యులు రఘువీర్ రెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి నల్లగొండ జిల్లా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీటి విడుదలకు చర్యలు తీసుకునేలా ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సాగర్ నుంచి నీటిని విడుదల చేయడం ద్వారా రైతులకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు కూడా కొంతమేర పరిష్కారం లభిస్తుందని ఆయన అన్నారు. తెలంగాణ రైతులకు అన్యాయం జరుగుతోందనే అపోహలకు తావులేకుండా ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకుని నల్లగొండ జిల్లా రైతులను ఆదుకోవాలని నూకల వెంకటరెడ్డి కోరారు.

# వర్షాభావంలో రైతులను ఆదుకోవాలి

**●తెలంగాణలో ఫసల్ బీమా వెంటనే అమలు చేయాలి**
**●బీజేపీ నేత ధరణిపతి రమణారావు డిమాండ్**

**చింతపల్లి, ఆగస్టు 22 (నేటి దర్శిని):**
రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చిన్న, సన్నకారు, కౌలు రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీజేపీ మాజీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు, మాజీ ఉపసర్పంచ్ ధరణిపతి రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు.ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు పంట నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు అవసరమైన ప్రాంతాలకు సాగునీటిని అత్యవసరంగా విడుదల చేయాలని కోరారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలోని నీటి నిల్వలు, ఇన్‌ఫ్లోలు, సాగునీటి అవసరాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళిక ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**ఫసల్ బీమా అమలు చేయాలి**



రైతులకు పంట నష్టాల నుంచి రక్షణ కల్పించే లిప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)లిను తెలంగాణలో వెంటనే అమలు చేయాలని రమణారావు కోరారు. వర్షాభావం, అధిక వర్షాలు, వరదలు తదితర ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన**

వర్షాభావ ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలు, డ్రిప్, స్ప్రింక్లర్ సాగు, నీటి పొదుపు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి మండలంలో వ్యవసాయ, నీటిపారుదల అధికారులతో రైతుల సమావేశాలు నిర్వహించి “ఎంత నీరు ఉంది.. ఎంత అవసరం.. ఏ పంట వేయాలి” అనే అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని సూచించారు.
వర్షాభావ పరిస్థితులు కొనసాగితే ముందస్తు కరువు, కాంటింజెన్సీ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని, పంట నష్టాలను శాస్త్రీయంగా అంచనా వేసి నష్టపరిహారం అందించాలని ధరణిపతి రమణారావు డిమాండ్ చేశారు.“రైతు పంట పండించినప్పుడు మాత్రమే కాదు.. పంట నష్టపోయినప్పుడు కూడా ప్రభుత్వం రైతు పక్కన నిలబడాలి” అని ఆయన పేర్కొన్నారు.





# విద్యార్థులకు అండగా బందె రాజేందర్ రెడ్డి అభిమానులు

- జన్మదిన వేడుకల సందర్భంగా అన్నదానం, పరీక్ష సామగ్రి పంపిణీ
- కురుమిద్ద పాఠశాలలో బందె రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 22 (నేటి దర్శిని) :** విద్యార్థుల విద్యాభివృద్ధికి, పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ పిలుపునిచ్చారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి చదివే తత్వం అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆయన అన్నారు. శనివారం యాచారం మండల పరిధిలోని కురుమిద్ద గ్రామ మాజీ వార్డు సభ్యులు బందె రాజేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు పంది శ్రీను, గోపలి మహేందర్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ,విద్యార్థులకు అన్నదానం చేశారు. పదో తరగతి విద్యార్థులకు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ చేతుల మీదుగా పరీక్ష ప్యాడ్లు, పరీక్షా సామగ్రి,



నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ఎంతో కీలకమైనవని, భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకునేలా విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. పరీక్షలను ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని, సమయపాలన పాటిస్తూ ప్రతి సబ్జెక్టుపై సమగ్ర అవగాహన పెంచుకోవాలని అన్నారు. సెల్ ఫోన్లకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు. బందె రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విధ్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకుని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలను విద్యార్థుల మధ్య సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. అనంతరం సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సునీల్ కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్యుత్ రెడ్డి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు స్వప్న, శ్రీనివాస్, అశోక్, రాణి, వీరమణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే బందె రాజేందర్ రెడ్డి అభిమానులు పంది శ్రీను, గోపలి మహేందర్, గోపలి పవన్ కుమార్, పంది వెంకటేష్, మంద డేవిడ్, పంది అరవింద్, బాబురావు, కోటేశ్, యశ్వంత్, నాని తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గాయత్రి యజ్ఞోపదారణ గోడ పత్రిక ఆవిష్కరణ



**ఆమనగల్లు,ఆగస్టు22(నేటి దర్శిని);** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో శివ భక్త మార్కండేయ దేవాలయ ఆవరణలో శనివారం 40 వ నూలు పూర్ణిమ గాయత్రి యజ్ఞోప ధారణ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఆలయ పురోహితులు విఘ్నె శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు.ఆలయ పూజారి ఈ సందర్భంగా మాట్లాడుతూ 27/8/2026 గురువారం సాయంత్రం స్వామివారిని ఊరేగింపుతోపల్లకి సేవ రాత్రి 9 గంటలకు అఖండ భజన, 28/8/2026 శుక్రవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా ఉదయం స్వామివార్లకు సుప్రభాత సేవ, గణపతి పూజ, శివాభిషేకం, ధ్వజారోహణం,జ్యోతి ప్రజ్వలన, గాయత్రి యజ్ఞం, దేవతామూర్తులకు నూతన వస్త్రాలంకరణ సేవ కార్యక్రమాలను నిర్వహిస్తారని ఆలయ పూజారి విఙ్ఞే శర్మ తెలిపారు.అనంతరం రక్షాబంధనం, గాయత్రి ధారణ,పూర్ణాహుతి తో కార్యక్రమాలు ముగుస్తాయని ఆలయ పూజారి అన్నారు.అనంతరం దేవాలయ కమిటీ వారిచే అన్న ప్రసాద కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు తీసుకొని, స్వామివారి కరుణాకటాక్షాలను పొందగలరని ఆలయ నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో గాజుల సత్య రాములు, భావండ్ల ఆంజనేయులు,దోర్నాల ఈశ్వరయ్య,ఎంగలి యాదగిరి, మధు, ఎంగలి శ్రీధర్, గుజ్జరి ప్రవీణ్, చెరుకు రవీందర్,గుద్దేటి నిరంజన్,వాసు,కన్నా, అప్పం అలివేలు తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ పాఠశాలలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం, బోనాలు

- సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినుల సందడి.. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు





**చింతపల్లి, ఆగస్టు 22 (నేటి దర్శిని):** కురుమేడు గ్రామంలోని నవోదయ పాఠశాలలో కరస్పాండెంట్ అనంతుల జంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం, బోనాల కార్యక్రమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. పాఠశాల ఆవరణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. విద్యార్థినులు ఉత్సాహంగా బోనాలతో పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా కరస్పాండెంట్ అనంతుల జంగయ్య గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పండుగల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు సంప్రదాయాలను కొనసాగించేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం అందించాలి





**మిడ్జిల్,ఆగస్టు 22, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో) :** పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జి.జి.హెచ్)లో సీఎస్‌ఆర్ నిధులతో సుమారు రూ.32 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఏడు ఆధునిక వైద్య పరికరాలను శనివారం కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. వీటిలో అల్ట్రాసౌండ్ స్కానర్, ఫోటోథెరపీ యూనిట్లు, సి-ఆర్మ్ యంత్రం, సర్జికల్ డ్రిల్ తదితర పరికరాలు ఉన్నాయి.అనంతరం హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో



ఆసుపత్రి మౌలిక వసతులు, వైద్య పరికరాలు, సిబ్బంది కొరతపై సమీక్షించారు. అవసరమైన పరికరాల ప్రతిపాదనలు రెండు రోజుల్లో సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఎమర్జెన్సీ వార్డులో 24 గంటలూ ల్యాబొరేటరీ, ఫార్మసీ సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని, 16 రెస్ట్‌రూమ్‌లను వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, ఐసీయూలో కార్డియాక్ మానిటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు త్వరితగతిన నియామకాలు చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, జిల్లా వైద్యాధికారి ఏ. శ్రీనివాసులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ రంగా అజ్మీరా తదితరులు పాల్గొన్నారు.

# జడ్చర్ల నియోజకవర్గంలోనే దోనూర్ బోనాలకు ప్రత్యేక ప్రాధాన్యం

- 23 నుంచి 25 వరకు మైసమ్మ, పోచమ్మ దేవతలకు బోనాల పండుగ.. భారీగా తరలిరానున్న భక్తులు






**మిడ్జిల్ ఆగస్టు 22, (నేటి దర్శిని):** మిడ్జిల్ మండలం దోనూర్ గ్రామంలో మైసమ్మ, పోచమ్మ దేవతల బోనాల పండుగను ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు దోనూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. బోనాల సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి, అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించనున్నారు.పండుగ రెండో రోజు బోనాలతో పాటు సుమారు 100 ఎడ్లబండ్లతో అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు తరలిరానున్నారు. ఈ సందర్భంగా దాదాపు 5 వేల మంది వరకు భక్తులు పాల్గొనే అవకాశం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ఎడ్లబండ్ల ఊరేగింపు, బోనాల సమర్పణ, ప్రత్యేక పూజలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది.శిలగా మారిన వ్యక్తి కథతో ప్రత్యేకత దోనూర్ మైసమ్మ అమ్మవారి ఆలయానికి స్థానికంగా ఓ ప్రత్యేకమైన చరిత్ర ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. అమ్మవారి కోరిక మేరకు ఓ వ్యక్తి శిలగా మారినట్లు తరతరాలుగా కథ ప్రచారంలో ఉందని పేర్కొంటున్నారు. ఈ విశ్వాసం కారణంగానే దోనూర్ మైసమ్మ బోనాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడిందని భక్తులు భావిస్తున్నారు.బోనాల పండుగ సందర్భంగా భక్తులు తమ మొక్కులు చెల్లించుకోవడంతో పాటు కుటుంబసమేతంగా అమ్మవార్లను దర్శించుకుని ఆశీస్సులు పొందనున్నారు. పండుగను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. దోనూర్ బోనాల వేడుకలు ఈసారి ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

# జీవో 97ను తక్షణమే రద్దు చేయాలి

## ఏరన్ పల్లి శ్రీనివాస్ డిమాండ్

**(నేటి దర్శిని) : కోడంగల్: ఆగస్టు 22** తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చేలా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 97ను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఏరన్ పల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను గతంలో మాదిరిగానే టెక్నికల్ ఎడ్యుకేషన్ పరిధిలోనే కొనసాగించాలని ఆయన స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాలిటెక్నిక్ విద్య అనేది పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలతో పాటు ఉన్నత విద్య, ఉపాధి



అవకాశాలను కల్పించే బలమైన వేదిక అని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు మరియు విద్యా రంగ నిపుణులతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం గర్హనీయమని మండిపడ్డారు.ప్రస్తుతం విద్యాశాఖ బాధ్యతలను స్వయంగా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి విద్యార్థుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. విద్యావేత్తలు, నిపుణులతో చర్చించి జీవో 97ను బేషరతుగా ఉపసంహరించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఈ జీవోను వెనక్కి తీసుకోకపోతే, విద్యార్థుల భవిష్యత్తు కోసం వారు చేపట్టే ప్రతి న్యాయబద్ధమైన ప్రజాస్వామిక పోరాటానికి తాము సంపూర్ణ మద్దతు తెలిపి ప్రత్యక్ష ఉద్యమంలో పాల్గొంటామని ఆయన హెచ్చరించారు.

